క్లుప్తంగా...

నూతన కార్యవర్గం

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమకారుల వేదిక నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం ఓయూ లో జరిగిన సమావేశంలో వేదిక చైర్మన్‌గా కంచర్ల బద్రీ, వైస్ చైర్మన్‌గా అందే కృష్ణ, మహిళా చైర్మన్‌గా కృష్ణలత, రాధిక, మహాదేవ్, రంజిత్, సూర్యప్రకాష్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తరచూ విద్యుత్ అంతరాయం.. ఇబ్బంది పడుతున్న జనం

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గత కొన్ని రోజుల నుంచి విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుంది. ఇటీవల లాలాపేట శ్రీపురి కాలనీలో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ సరఫరాను గంటల తరబడి అధికారులు నిలిపివేశారని ఆ కాలనీ నాయకులు, కాంగ్రెస్ ఎస్సీ డిపార్టుమెంట్ వైస్ చైర్మన్ బర్రె యాదగిరి తెలిపారు. ఈ విషయమై విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా లాభం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

చంద్రశేఖర్‌కు వివేకానంద సేవ అవార్డు



చిలకలగూడ: చిలకలగూడ చింతబావికి చెందిన సామాజిక కార్యకర్త మ్యాకల చంద్రశేఖర్ రావుకు స్వామి వివేకానంద సేవ అవార్డు వరించింది. నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో స్వామి వివేకానంద జయంతి ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బండ ప్రకాశ్, బొగ్గారపు దయానంద్, మాజీ మంత్రి, సినీ నటుడు బాబుమోహన్ సామాజిక సేవకుడు మ్యాకల చంద్రశేఖర్‌కు సేవ పురస్కార్‌ను అందించారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, అవార్డు అందించిన పెద్దలు, నిర్వాహకులకు మ్యాకల చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

వేలు కొరికిన వ్యక్తి రిమాండ్

రాంగోపాల్‌పేట్: తన వద్ద పనిచేయడానికి రావడం లేదనే కక్షతో ఓ వ్యక్తి వేలు కొరికిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. అభిలాష్, గుజ్జారి సాయి శివ ఇద్దరు కలిసి రోవీ కస్టమ్స్ పేరుతో వ్యాపారాన్ని నిర్వహించేవారు. అప్పుడు వీరి వద్ద శేఖర్‌రెడ్డి అనే వ్యక్తి టెక్నీషియన్‌గా పని చేసేవాడు. అయితే ఇద్దరు విడిపోయి వేర్వేరుగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. శేఖర్‌రెడ్డిని తన వద్ద పనిచేసేందుకు రావాలని సాయి శివ తరచూ ఒత్తిడి తెచ్చేవాడు. గత నెల డిసెంబర్ 13న శేఖర్‌రెడ్డి తన కంపెనీకి చెందిన ఉద్యోగులతో కలిసి రాణిగంజ్‌లో మెటీరియల్ కొనుగోలు కోసం వచ్చాడు. శేఖర్‌రెడ్డిని చూసిన సాయి శివ ఆవేశంతో దాడి చేయడంతో పాటు చిటికెన వేలును కొరకడంతో కొంత భాగం పూర్తిగా తెగిపోయింది. శేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న లేక్ పోలీసులు శనివారం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ఆదర్శనీయుడు శ్రీరాముడు

చిక్కడపల్లి: సర్వమానవాళికి శ్రీరాముడు ఆదర్శనీయుడని ప్రముఖ సాహితీవేత్త జయరాములు అన్నారు. అయోధ్యలో జరిగే శ్రీరామ దివ్యవైభవం కవితా సంకలనాన్ని శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మానవాళికి సర్వం రామమయమన్నారు. వెయ్యిమంది కవులు, కవయిత్రులతో రాములోరి జీవితంపై అయోధ్యలో కవి సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు తెలుగు భాషా చైతన్యసమితి అధ్యక్షుడు పి.బడేసాబ్ తెలిపారు. కార్యక్రమంలో జి.మనోహర్‌రెడ్డి, రామకృష్ణచంద్రమౌళి, యోగేశ్, ప్రభు పాల్గొన్నారు.

వేతనాలు లేక వెతలు!

- తొమ్మిది నెలల నుంచి ఆర్పీలకు విడుదల కాని జీతలు
- అధికారులు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు
- కొత్త ప్రభుత్వంపై ఆశలు



ఎమ్మెల్యే లాస్యనందితకు వినతిపత్రం ఇస్తున్న ఆర్పీలు (ఫైల్)

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్‌ల (ఆర్పీ)ల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రతి నెల ఇచ్చే గౌరవ వేతనం రూ.4 వేలను మే నుంచి విడుదల చేయకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని వాపోతున్నారు. మెప్మా ప్రారంభమైనప్పుడు గౌరవ వేతనం పన్నెండు వందల రూపాయలు ప్రభుత్వం ఇచ్చేది. కాలక్రమేణా నాలుగు వేలకు పెరగగా వేతనాలు సరిపోవడం లేదని ఆర్పీలు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతేడాది ఆరువేల రూపాయలకు పెంచిండంతో పాటు సమాఖ్యల ద్వారా మరో రెండు వేల రూపాయలను చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఆర్పీలు ఆనందం వ్యక్తం చేశారు. కాని పాత, పెరిగిన వేతనాలు రాకపోవడంతో అధికారులు, నాయకుల చుట్టూ తిరిగి విసిగిపోతున్నారు.

పెరిగిన విధులు, పనివేళలు..

పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయడం, కొత్త సంఘాలు స్వయం ఉపాధి పథకాలు పొందేందుకు బ్యాంకులు లబ్ధిదారులకు మధ్య వారధిగా వ్యవహరిస్తున్నారు. వీటితో పాటు ఎన్నికల్లో బీఎల్‌ఓ విధులు, ఫ్రైడే–డ్రైడే, స్ట్రీట్ వెండర్స్ గుర్తించడంతో పాటు ప్రభుత్వ పథకాల ప్రచార కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ విధులు నిర్వహిస్తున్నారు. వివిధ రకాల్లో ఆర్పీల పనివేళలు పెరిగినప్పటికీ ప్రభుత్వం గౌరవ వేతనాలు నెల నెలా చెల్లించకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బోర్డు 8 వార్డులు, జీహెచ్ఎంసీ 150 డివిజన్ పరిధిలో సుమారు 55 మంది వరకు ఆర్పీలు విధులు నిర్వహిస్తున్నారు.

నేతలతో మొర

గౌరవ వేతనాలు 6 వేలు, సమాఖ్యల ద్వారా మరో రెండు వేల రూపాయలు విడుదల కాకపోవడంతో తమ వేతనాలను విడుదల చేయించాలని ఆర్పీలు నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఎన్నికైన లాస్యనందితను ఆర్పీలు ఇటీవల కలిసి తమ సమస్యలను తెలిపి నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వేతనాలు విడుదల జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న జీవీ. వెన్నెలను సైతం కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ వేతనాలు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఇరువురు నేతలు హామీ ఇచ్చారు.

అభినందనలు



శ్యాంసుందర్‌గౌడ్‌కు మొక్క అందజేస్తున్న నాయకులు

సనత్‌నగర్: బీజేపీ సికింద్రాబాద్–మహంకాళి జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన శ్యాం సుందర్‌గౌడ్‌ను సనత్‌నగర్ డివిజన్‌కు చెందిన నాయకులు శనివారం అభినందించారు. బీజేపీ సీనియర్ నేత మూల రవీందర్ ఆధ్వర్యంలో అమీర్‌పేటలోని శ్యాంసుందర్‌గౌడ్ నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి మొక్కను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నేతలు దయానంద్, కన్నూరి క్రాంతికుమార్, లక్ష్మీనారాయణ, చంద్రకుమార్, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

'మహాహారతి' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

చిలకలగూడ: అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ ప్రాంగణంలోని భారీ హనుమాన్ విగ్రహం వద్ద శనివారం మహాహారతి పోస్టర్ ఆవిష్కరించారు. సోమవారం సాయంత్రం 6.30 గంటలకు హనుమాన్ చాలీసా, శ్రీరామ తారకమంత్రపఠనం, మహాహారతి తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మనీష్‌రాజ్, కాచంరాము, మహదేవన్‌రవి, సాయికుమార్‌యాదవ్, నవీన్ డీజే తెలిపారు.

హామీల అమలుపై దృష్టి పెట్టాలి:డిప్యూటీ మేయర్



సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: బీఆర్‌ఎస్ పార్టీపై విమర్శలు చేయడం మాని ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెడితే బాగుంటుందని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి సూచించారు. శనివారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగిన సికింద్రాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మీతో పాటు డిప్యూటీ మేయర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 200 యూనిట్ల గృహజ్యోతి పథకాన్ని ఈ జనవరి నుంచే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు సైతం కరెంట్ బిల్లులు చెల్లించొద్దన్నారు. విద్యుత్ అధికారులు బిల్లులు అడిగితే సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలను గుర్తు చేయాలన్నారు. హైదరాబాద్ నగరంలోని పేద ప్రజలు, అద్దె ఇళ్లలో ఉండే వారికి సైతం గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రజల పక్షాన ఉంటూ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసే వరకు ప్రజలకు అండగా ఉంటుందని, అవసరమైతే ఉద్యమిస్తోందన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం.. అప్రమత్తత అవసరం



నిజాం కాలం నాటి నిర్మాణం (దర్వాజ)పై ఏపుగా పెరిగిన వృక్షంతో ప్రమాదం పొంచి ఉంది. పాతకాలం నాటి నిర్మాణం శిథిలావస్థకు చేరింది. దానిపైన పెద్ద చెట్టుతో పాటు పిచ్చి మొక్కలు మొలిచాయి. ఇటీవల రోడ్డు విస్తరణలో ఆ దర్వాజ పక్కన ఉన్న నిర్మాణాలను కూల్చి వేయడంతో ఆ చెట్ల వేర్లు బయటికి రావడంతో ఆ నిర్మాణానికి పగుళ్లు వచ్చాయి. ఈ దర్వాజ గుండా నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఏప్పుడైనా చెట్టు, ఆ నిర్మాణం కూలిపడే అవకాశం ఉంది.ఈ విషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఉన్నతాధికారులు స్పందించి ఏపుగా పెరిగిన వృక్షాన్ని తొలగించి, నిజాం కాలం నాటి నిర్మాణాన్ని పరిరక్షించాలని సామాజిక కార్యకర్త నేతికార్ మహేశ్ విజ్ఞప్తి చేశారు. –లాలాపేట

రైలులో మర్చిపోయిన ల్యాప్‌టాప్ అప్పగింత



చిలకలగూడ: రైలులో మరిచిపోయిన ల్యాప్‌టాప్‌ను యజమానికి అప్పగించిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నగరానికి చెందిన బోర లక్ష్మీనారాయణ విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వచ్చిన గరీబ్‌రథ్ రైలులో ప్రయాణించాడు. ఈ నెల 20వ తేదీ ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో దిగి ఇంటికి వెళ్లిపోయాడు. తాను ప్రయాణించిన జీ–1 కోచ్‌లోని 51వ బెర్త్‌లో తన ల్యాప్‌టాప్, వాలెట్ మర్చిపోయాడు. ఇంటికి వెళ్లిన తర్వాత గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన పోలీసులు ల్యాప్‌టాప్, వాలెట్‌లను స్వాధీనం చేసుకుని యజమానికి అందించారు. విలువైన వాలెట్‌తో పాటు ల్యాప్‌టాప్‌ను సురక్షితంగా అందించిన సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులకు లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపాడు.

ఆలయాల్లో శుద్ధి కార్యక్రమాలు



దేవాలయంలో శుద్ధి చేస్తున్న భగవంత్‌రావు

రాంగోపాల్‌పేట్: ఈ నెల 22వ తేదీన అయోధ్యలో రామమందిరంలో స్వామివారి విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమం మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు సికింద్రాబాద్ గణపతి దేవాలయంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంత్‌రావు, ఉపాధ్యక్షులు నర్సింగ్, సెంట్రల్ కమిటీ సభ్యులు రాహుల్ స్వగత్, దేవాలయ మాజీ చైర్మన్ పిట్ల నగేష్‌తో పాటు పలువురు సభ్యులు దేవాలయానికి వచ్చి శుద్ధి కార్యక్రమం చేపట్టారు.

సనత్‌నగర్‌లో...

సనత్‌నగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు స్వచ్ఛ అభియాన్‌లో భాగంగా శనివారం సనత్‌నగర్‌లో స్వచ్ఛ తీర్థ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఇండస్ట్రీయల్ ప్రాంతంలోని పబ్బా ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దయానంద్, శ్రీశైలంగౌడ్, కన్నూరి చంద్రకుమార్, రాంప్రసాద్, విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



స్వచ్ఛ తీర్థ్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు

సున్నిత సునిశిత మనస్వి బాపు



చిక్కడపల్లి: సినీ దర్శకుడు, చిత్రకారుడు బాపు సున్నిత మనస్వి అని, ఆయన తీసిన ప్రతి చిత్రం కళాఖండమని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు అన్నారు. కళానిలయం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో శనివారం రాత్రి బాపు 90వ జయంతిని పురస్కరించుకుని ప్రముఖ సినీ నటుడు, తనికెళ్ల భరణికి బాపు పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచనలో నవరసాలను పలికించే శక్తి భరణికి ఉందని ఆయన అక్షరాల్లో ప్రతి పాత్ర ఆవిష్కృతమవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పక్షాన భరణికి జీవిత సాఫల్య పురస్కారం బహూకరిస్తామని ప్రకటించారు. సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ భరణి కేవలం నటుడు మాత్రమే కాదని, అత్యున్నత వ్యక్తిత్వం కలవారని కొనియాడారు. కేంద్రసాంగీత నాటక అకాడమీ కౌన్సిల్ సభ్యురాలు నాట్యగురువు డాక్టర్ ఎస్‌పి భారతి అధ్యక్షతన జరిగిన సభలో కళాపోషకులు కె.ఈ.రాజు , ఎం.వెంకటేశ్వరావు, స్వప్న, రాజు, స్వప్న శ్రీనివాస్, సుభాషిణి, పద్మావతి పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా





సనత్‌నగర్: జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 ఆసరా కమిటీ ఆధ్వర్యంలో మోడల్‌కాలనీలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో శనివారం సీనియర్ సిటిజన్స్‌కు క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఆసరా సర్కిల్ కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి ఆధ్వర్యంలో పోటీలను జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ జగన్ ప్రారంభించారు. అనంతరం సీనియర్ సిటిజన్స్‌తో కలిసి ఆయా క్రీడా పోటీల్లో పాల్గొని వారిలో ఉత్తేజాన్ని నింపారు. క్యారమ్స్ (సింగిల్స్, డబుల్స్), జనరల్ నాలెడ్జ్, చదరంగం, బ్రిస్క్ వాక్, మ్యూజికల్ చైర్ తదితర పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న సీనియర్ సిటిజన్స్‌కు సంఘ సేవకులు కొత్తపల్లి మధుసూదన్‌రావు అల్పాహారం, భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ జగన్ మాట్లాడుతూ.. వయస్సుతో సంబంధం లేకుండా క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ఇక్కడి సీనియర్ సిటిజన్స్ స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. ఇలాంటి క్రీడా పోటీలు వారిలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని అందిస్తాయని చెప్పారు. ప్రభుత్వం తరుపున కూడా సీనియర్ సిటిజన్స్ సంక్షేమం కోసం సహాయ సహకారాలు అందేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సంఘాల ప్రతినిధులు పార్థసారధి, రాములు, ఉమామహేశ్వర్‌రావు, అనంతరెడ్డి, వైదేహి ప్రసాద్, నాగమణి, ప్రసాద్, పద్మిని, రాజేశ్వరి, పూర్ణచందర్‌రావు, భద్రయ్య పాల్గొన్నారు.

ఏవియేషన్.. ఆకర్షించేన్







బేగంపేట విమానాశ్రయంలో వింగ్స్ ఇండియా–2024 సందడిగా కొనసాగుతోంది. ఆదివారంతో ముగియనున్న ఈ షోను తిలకించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భారీగా తరలివస్తున్నారు. మొదటి రెండు రోజులు బిజినెస్ విజిటర్స్‌ను మాత్రమే అనుమతించగా, శని, ఆదివారాల్లో సామాన్య సందర్శకులకు అవకాశం ఇచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం సందర్శకులు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఇంకా భారీగా తరలివచ్చే అవకాశాలు ఉన్నాయని ఏవియేషన్ షో నిర్వాహకులు భావిస్తున్నారు. ప్రధానంగా ఈ షోలో కొలువుదీరిన విమానాలు, హెలికాప్టర్ల ముందు ఫొటోలు దిగేందుకు సందర్శకులు ఉత్సుకత కనబరుస్తున్నారు. అదే విధంగా సారంగ్ టీమ్, మార్క్ జాఫరీస్ బృందాలు చేసే ఎయిరో బాటిక్స్ కళ్లు చెదిరేలా (కట్టిపడేసేలా) చేస్తున్నాయి. ఆదివారం(నేడు) హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సందర్శించనున్నారు. –సనత్‌నగర్